నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 కరీంనగర్, శుక్రవారం 26 జనవరి 2024 JAGTIAL

## ఉత్తమ సేవల్లో సిరిసిల్ల టీ-హబ్ టాప్

సిరిసిల్ల టౌన్, జనవరి 25 : ఉత్తమ సేవల విభాగంలో 2023 సంవత్సరానికి సిరిసిల్లలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్(టీ-హబ్) తెలంగాణలోనే మొదటి ర్యాంకును సాధించింది. మమోగ్రాం, లివర్ ఫంక్షనింగ్, ఎక్స్‌రే, కిడ్నీ ఫంక్షనింగ్, థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ బీ-3, విటమిన్ బీ-12, సీబీపీ, తదితర పరీక్షల విభాగాల్లో జనవరి 2023 నుంచి 2023 డిసెంబర్ 31 వరకు 79,365 రోగులకు 2,54,410 పరీక్షలు చేసినందుకు రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించినట్లు టీ-హబ్ కోఆర్డినేటర్ రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్ చేతుల మీదుగా రాంప్రసాద్ జ్ఞాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అభినందించారు.


కర్ణన్ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న టీ-హబ్ కోఆర్డినేటర్ చిలుక రాంప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన మాజీ మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్‌పర్సన్

# బస్సుపై భారం

- మహిళలకు బస్ ఫ్రీ జర్నీ ఎఫెక్ట్
- ఆర్టీసీకి పెరుగుతున్న ఓవర్‌లోడ్
- డిమాండ్‌కు సరిపడా లేని సర్వీసులు
- సామర్థ్యానికి మించి ప్రయాణికులు
- ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులు
- జాతర్ల సీజన్‌తో మరింత రద్దీ
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో యంత్రాంగం
- మరో 300 బస్సులైనా అవసరమని అంచనా

**ప్రజారవాణాలో ముందున్న ఆర్టీసీపై పెను భారం పడుతున్నది. ముందస్తు ప్రణాళిక.. అంచనా లేకుండా బస్ ఫ్రీ జర్నీ చేయడంతో ఊహించలేనంతగా తాకిడి పెరుగుతున్నది. కెపాసిటీకి మించి ప్రయాణిస్తుండడంతో బస్సుపై ఓవర్‌లోడ్ పడుతుండగా, డ్రైవర్లు, కండక్టర్లు ఒత్తిడికి లోనుకావాల్సి వస్తున్నది. ప్రయాణికులు కూడా సీట్ల కోసం ఇబ్బంది పడుతుండగా, డిమాండ్‌కు అనుగుణంగా సర్వీసులు నడిపితేనే ఈ సమస్య నుంచి గట్టెక్కే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం జాతర్ల సీజన్ కావడంతో రద్దీ మరింత పెరుగుతుండగా, యంత్రాంగం ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలైంది.**




కరీంనగర్, జనవరి 25 (నమస్తే తెలంగాణ)/తెలంగాణచౌక్ : కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల పరిధిలో 867 బస్సులు ఉన్నాయి. అందులో 339 అద్దె బస్సులు నడుస్తున్నాయి. అయితే రాష్ట్ర సర్కారు గతేడాది డిసెంబర్ 9 నుంచి మహిళలకు బస్సు ఫ్రీ జర్నీని ప్రవేశపెట్టింది. మొత్తం 667 పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలు ఉచిత ప్రయాణం చేస్తుండగా, మిగిలిన 200 బస్సుల ద్వారానే సంస్థకు నేరుగా ఆదాయం వస్తున్నది. రాష్ట్రంలో అత్యధికంగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించే రీజియన్లలో కరీంనగర్ ప్రథమ స్థానంలో ఉన్నది. కాగా, ఫ్రీ జర్నీకి ముందు రీజియన్‌లో సగటున రోజుకు 2.40 లక్షల మంది బస్సుల్లో ప్రయాణించగా, ₹1.50 కోట్ల ఆదాయం వచ్చేది. మహిళల ఉచిత ప్రయాణం ప్రారంభమైన తర్వాత బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య 3.90 లక్షలకు పెరిగింది. అలాగే ఆదాయం కూడా పెరిగింది. కానీ, ప్రయాణికుల నుంచి నేరుగా సంస్థకు వస్తున్న ఆదాయం మాత్రం సగటున ₹92 లక్షలకు పడిపోయింది.

### సీట్లకు మించి ప్రయాణం

మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం తర్వాత ఆర్టీసీ బస్సుల్లో ఒక్కసారిగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. దీంతో ఏ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు చూసినా ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నది. సీట్ కెపాసిటీ ప్రకారం చూస్తే.. పల్లెవెలుగులో 55, ఎక్స్‌ప్రెస్‌లో 50 సీట్లు మాత్రమే ఉంటాయి. కానీ, ఒక్కో బస్సులో 80 నుంచి 100 మంది ప్రయాణిస్తున్నారు. ఒక్కోసారి అంతకంటే ఎక్కువే వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికులు సీట్ల కోసం పోటీ పడుతున్నారు. ఒక్కోసారి గొడవల దాకా వెళ్తున్నారు. అది ఏ రూట్ అయినా ఇదే పరిస్థితి ఉంటుంది. దీంతో పూర్ పర్ఫార్మెన్స్ ఉన్న దూర ప్రాంత సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసి.. లోకల్ ట్రిప్పులకు వాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ రకంగా ఇప్పటి వరకు రీజియన్ పరిధిలో మంథని డిపో నుంచి మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు వెళ్లే రెండు ఎక్స్‌ప్రెస్‌లు, మెట్‌పల్లి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పామూరుకు వెళ్లే ఒక ఎక్స్‌ప్రెస్‌ని, కరీంనగర్ -1 డిపో నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని నర్సారావుపేటకు వెళ్లే మరో ఎక్స్‌ప్రెస్ సర్వీసును తాత్కాలికంగా రద్దు చేసి స్థానిక అవసరాలకు వాడుకుంటున్నారు. సేవా భావంతో నడుస్తున్న సంస్థలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు అందుబాటులో లేక పోవడంతో పరిస్థితి దారుణంగా మారింది.

### కొత్త బస్సులు వచ్చినా..

ప్రతి రీజియన్‌కు కొత్త బస్సులు ఇస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇదివరకే ప్రకటించారు. అయితే, కరీంనగర్‌కు ఎన్ని వస్తాయనే విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. నిజానికి ఇప్పుడున్న డిమాండ్‌ను బట్టి మరో 300 బస్సులైనా ఇవ్వాల్సిన అవసరమున్నది. కానీ, ప్రభుత్వం రాష్ట్రానికి తెస్తున్న కొత్త బస్సుల సంఖ్యను చూస్తే 150 వరకే వచ్చే అవకాశమున్నది. ఈ బస్సులు త్వరగా వస్తే కొంత వరకైనా భారం తగ్గేది. కానీ, ఇవి ఎప్పుడు వస్తాయా..? అని అధికారు లు ఎదురు చూడాల్సి వస్తున్నది. ఉచిత బస్సు ప్రయా ణం కల్పించే ముందు రాష్ట్ర ప్రభుత్వం సరైన అంచనా వేయని కారణంగానే ఇబ్బందులు తప్పడం లేదు.

### ఉద్యోగులపై ఒత్తిడి

ఆర్టీసీలో ఉద్యోగులకు కూడా ఒత్తిడి తప్పడం లేదు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలనే ఉద్దేశంతో అధికారులు ఉన్నంతలో సంస్థ అంతర్గత సామర్థ్యాలను పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లతోపాటు ప్రతి ఉద్యోగి అవసరాన్ని బట్టి గంట, రెండు గంటలు అదనంగా పనిచేస్తున్నారు. ఒక్కో బస్సు రోజుకు సగటున 400 నుంచి 420 కిలోమీటర్లు తిరుగుతుంటాయి. అయితే, బస్సుల సామర్థ్యాన్ని మించి ప్రయాణికులు వస్తున్న నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నన్నారు. బస్సులో కాలు తీసి కాలు పెట్టలేనంతగా జనం ఉండడంతో టికెట్లు కూడా ఇచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల అవసరానికి అనుగుణంగా బస్సుల సంఖ్య పెరిగితే గానీ తమపై ఒత్తిడి తగ్గే పరిస్థితి కనిపించడం లేదని స్పష్టం చేస్తున్నారు.

### జాతర్ల సీజన్ గట్టెక్కేనా..?

రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క, సారలమ్మ జాతరలు వచ్చే నెల 18 నుంచి ప్రారంభమవుతున్నాయి. అయితే, మేడారం వనదేవతల వద్దకు వెళ్లే ప్రతి ఒక్కరూ కరీంనగర్ రీజియన్ పరిధిలో ఉన్న వేములవాడ రాజన్నను దర్శించుకోవడం సెంటిమెంట్. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల, వేములవాడ డిపోలకు తాకిడి పెరిగింది. వేములవాడలో 57, సిరిసిల్లలో 60 బస్సులు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికే రీజియన్ పరిధిలోని 9 డిపోల నుంచి 80 బస్సులను వేములవాడ జాతర కోసం ఎంగేజ్ చేశారు. సమ్మక్క, సారలమ్మ జాతర దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగే అవకాశముంటుంది. దీనిని అధిగమించేందుకు కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ ప్రతి జాతర సీజన్‌లో కరీంనగర్ రీజియన్ బస్సులు మొత్తం 5 వేల నుంచి 6 వేల ట్రిప్పులు నడుస్తుండగా, ఈ డిమాండ్‌కు అనుగుణంగా ఇతర రీజియన్ల నుంచి బస్సులు సర్దుబాటు చేసుకోవాలని భావిస్తున్నారు. మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన తరుణంలో ఇది ఎంత వరకు సాధ్యమవుతుందనేది వేచి చూడాలి.

## కాంగ్రెస్ రాజ్యమా.. ఖాకీల రాజ్యమా..?

- ఆ పార్టీ అన్యాయంగా ప్రవర్తిస్తున్నది
- కేసీఆర్ సర్కారు చేసిన అభివృద్ధిని ఓర్వలేకపోతున్నది
- మా నాయకులను అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నది
- ఇక చూస్తూ ఊరుకునేది లేదు.. పోరాడుతాం
- కక్షపూరితంగా వ్యవహరిస్తే ప్రజలే తిరుగబడుతరు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- జగిత్యాల సబ్ జైలులో బీఆర్‌ఎస్ సర్పంచ్‌కు పరామర్శ

జగిత్యాల, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ రాజ్యమా..? లేదా ఖాకీల రాజ్యమా..? అని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ అక్రమ కేసులు బనాయించి వేధిస్తే సహించబోమని, కాంగ్రెస్ ఆగడాలను చూస్తూ ఊరుకోబోమని తేల్చి చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధి పనులను పక్కన పెట్టి కక్షసాధింపు చర్యలకు దిగడం సరికాదని హితవు పలికారు. ఇటువంటి వైఖరి ఎక్కువ రోజులు నిలబడదని, ప్రజలు తిరుగబడుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పెట్టిన అక్రమ కేసులు ఎదుర్కొంటూ జగిత్యాల సబ్ జైలులో ఉన్న జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించేందుకు గురువారం ఆమె మెట్‌పల్లి మీదుగా వెళ్లారు. ముందుగా ఇక్కడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆ తర్వాత జగిత్యాల వెళ్లి రాజేశ్వర్‌రెడ్డిని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి పరామర్శించారు. అధైర్య పడొద్దని, బీఆర్‌ఎస్ వెన్నంటి ఉంటుందని రాజేశ్వర్‌రెడ్డికి భరోసానిచ్చారు. అనంతరం విలేకరులతో కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కేసీఆర్ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే దౌర్జన్యాలు ప్రారంభించారని మండిపడ్డారు. ఆ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని, ప్రతి నియోజకవర్గంలోనూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు మోపుతూ భయపెడుతున్నదని విమర్శించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని సంబంధం లేని కేసులో ఇరికించి, జైలులో పెట్టించారని ఆరోపించారు. తమ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించడాన్ని చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. చట్టపరంగానే కాకుండా ప్రజాక్షేత్రంలో సైతం ఎదుర్కొంటామని తేల్చిచెప్పారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసంక్షేమానికి పాటుపడిందే తప్ప ఇలాంటి నీచ రాజకీయాలు చేయలేదని స్పష్టం చేశారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నామని, ఏ పార్టీ కార్యకర్తలపైన ఇలా వ్యవహరించలేదని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన అభివృద్ధి పనులను పక్కన పెట్టి ఇలాంటి చర్యలకు దిగడం సరికాదని హితవు పలికారు. హైదరాబాద్ యూనివర్సిటీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినులను మహిళా పోలీసులు జుట్టు పట్టి లాగి పడగొట్టారని, ఇదెక్కడి పాలన అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పోలీసులు ఏనాడూ ఇలా వ్యవహరించలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఒరవడి ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ హయాంలో జరుగుతున్న కక్షపూరిత చర్యలు, ఖాకీల దాష్టికాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. ఉద్యమాలు, పోరాటాలు చేసి వచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాని సమర్థవంతంగా పోషిద్దామని, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా పోరాటం చేద్దామని, మళ్లీ ప్రజల మనసు గెలుచుకుందామని చెప్పారు. ఏదేమైనా కాంగ్రెస్ బెదిరింపులకు భయపడవద్దని, ఉద్యమంలో ఇలాంటి ఎన్నో కేసులు, అణిచివేతలకు ఎదురొడ్డి కొట్లాడామని, ఇప్పుడు తిరగబడి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆమె వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు ఉన్నారు.


సన్మానం తర్వాత సర్పంచులతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

## ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- ప్రజలతో మమేకం కావాలి
- రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం ఖాయం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, జనవరి 25 : బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని, ప్రజలతో మమేకం కావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం సృష్టించబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచుల పదవీకాలం ముగింపు సందర్భంగా గురువారం ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గస్థాయి సర్పంచులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చెందిందని, ₹1600 కోట్లతో పనులన్నీ సర్పంచ్‌ల చేతుల మీదుగా జరిగాయని గర్వంగా చెప్పుకోవచ్చన్నారు. జీపీలకు సంబంధించి ₹6వేల కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు గ్రామాల్లో అధ్వాన్నంగా రోడ్లు, మురుగుకాలువలు, చెత్తాచెదారంతో కంపు కొట్టే వీధులు, ఎప్పుడు కూలుతాయో తెల్వని విద్యుత్ స్తంభాలు, వేలాడే విద్యుత్ తీగలు.. ఇలాంటి దృశ్యాలుండేవని, మళ్లీ ఇప్పుడు ఆ రోజులు రాబోతున్నాయని తెలిపారు. ఇప్పటికే చెరువులు ఎండిపోయాయని, కాలువల్లో నీళ్లు పారకం లేదని, కరెంటు కోతలు మొదలయ్యాయని, యూరియా దొరక్క రైతులు రోడ్డున పడ్డారని, పెన్షన్ జాడలేదని, రూ.2 లక్షల రుణమాఫీ దిక్కులేదని, కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ అసలే లేవని దుయ్యబట్టారు. ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఎందుకు ఇస్తిమా? అని మదనపడుతున్నారన్నారు.

### రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతరా..?

రైతుబంధు పడలేదన్నోళ్లను చెప్పుతో కొట్టండి అని, చదువుకున్నోళ్లందరికీ ఉద్యోగాలు ఇయ్యలేమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి కొప్పుల తీవ్రంగా ఖండించారు. ఈ రకంగా అహంకారపు మాటలు మాట్లాడడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు కనబడే పరిస్థితి లేదని, కనబడితే ప్రజలు కొట్టే పరిస్థితులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీలు బత్తిని అరుణ, రాజేందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, జిల్లా సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు గంగారెడ్డి పాల్గొన్నారు.


సిరిసిల్లలోని కలెక్టరేట్ మైదానంలో వేడుకలకు సిద్ధమవుతున్న వేదిక

## గణతంత్ర వేడుకలకు ముస్తాబు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 25 : 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్ మైదానం, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్లను అందంగా ముస్తాబు చేశారు. ఉదయం ఆయా జిల్లాల కలెక్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించేందుకు మైదానాలను అధికారులు సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. స్వాతంత్రోద్యమ పోరాటంలో పాల్గొన్న జిల్లాలోని సమరయోధులు, వారి కుటుంబ సభ్యులకు సన్మానంతో పాటు, విధుల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన వివిధ శాఖల ప్రభుత్వోద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. అలాగే, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరిగిన పురోగతిని వివరిస్తూ, స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# ప్రసవాల్లో ప్రథమం.. అమ్మకు అభయం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాలకు వచ్చిన గర్భిణులను సిబ్బంది అందిస్తున్న వైద్యంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి



- సిరిసిల్ల జిల్లాలో 'మిషన్ 80' సక్సెస్
- ప్రభుత్వ దవాఖానల్లోనే 80శాతం డెలివరీలు
- కేసీఆర్ సర్కారు కృషితో చేరువైన ఆధునిక వసతులు.. కార్పొరేట్ వైద్యం
- కాబోయే తల్లులపై ప్రత్యేక దృష్టి.. నెలనెలా పరీక్షలు
- గర్భిణుల్లో పెరిగిన నమ్మకం.. సర్కారుకే క్యూ
- తొమ్మిది నెలల్లోనే 3138 మందికి పురుడు
- ప్రైవేట్ కంటే మూడు రెట్లు అధికం
- పేద, మధ్యతరగతి కుటుంబాల హర్షం

**సర్కారు దవాఖాన అమ్మకు అభయమిస్తున్నది. అత్యాధునిక వైద్య పరికరాలు.. ఆపరేషన్ థియేటర్లు.. విశాలమైన గదులు.. అపార అనుభవమున్న వైద్య బృందం ప్రత్యేక దృష్టితో భరోసా కల్పిస్తున్నది. గత కేసీఆర్ సర్కారు తీసుకున్న చర్యలతో ప్రభుత్వ వైద్యం కార్పొరేట్‌కు దీటుగా తయారు కాగా, ప్రభుత్వ వైద్యశాలల్లో 80 శాతం ప్రసవాలు జరగాలన్న ఉద్దేశంతో సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి చేపట్టిన 'మిషన్ 80' విజయవంతమైంది. సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం, నాణ్యమైన వైద్య సేవలతో తొమ్మిది నెలల్లోనే 3,138 మందికి పురుడు పోసింది. ప్రైవేట్ కంటే రెండింతల డెలివరీలు జరుగడం ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కండ్లకు కడుతున్నది.**

రాజన్న సిరిసిల్ల, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : మాతా శిశు సంరక్షణకు తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ దవాఖానల్లో కార్పొరేట్ వసతులు కల్పించింది. ఇంకా అమ్మ ఒడి పథకం కింద మగశిశువు జన్మనిస్తే ₹12వేలు, ఆడ శిశువుకు జన్మనిస్తే ₹13వేలు ఇచ్చింది. అలాగే 16 వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్ కూడా అందిస్తూ వచ్చింది. ఈ పథకాలపై విస్తృత అవగాహన కల్పిస్తూనే సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ అనురాగ్ జయంతి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ దవాఖానల్లో 80 శాతం ప్రసవాలు చేయాలనే లక్ష్యంతో 'మిషన్ 80' చేపట్టారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం, తద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గించడం, మహిళలు అనారోగ్యాల బారిన పడకుండా చూడాలన్నది ఈ కార్యక్రమ లక్ష్యం కాగా, వైద్య శాఖ అధికారులు పకడ్బందీగా పనిచేశారు. అందించే సేవలు, సాధారణ కాన్పు వల్ల జరిగే లాభాలు, ఆపరేషన్లతో కలిగే ఇబ్బందులపై విస్తృతంగా అవగాహన కల్పించి సక్సెస్ అయ్యారు. దవాఖానల్లో ప్రత్యేక గదులను కేటాయించారు. హైరిస్క్ తప్ప మిగతా ప్రసవాలన్నీ ఆయా పీహెచ్‌సీలు, ఏరియా దవాఖానల్లో చేశారు. దీంతో కార్యక్రమ ప్రారంభానికి ముందు 56శాతం ఉన్న ప్రసవాల సంఖ్య అనతికాలంలోనే 80శాతానికి పెరిగింది. తొమ్మిది నెలల్లో జిల్లా వ్యాప్తంగా 4,447 ప్రసవాలు జరిగితే.. అందులో 3,138 కాన్పులు సర్కారు దవాఖానల్లోనే అయ్యాయి. మిగతా 1309 డెలివరీలు ప్రైవేట్‌లో జరిగాయి.


డెలివరీ కోసం వచ్చిన గర్భిణులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాల

**ప్రభుత్వ, ప్రైవేటులో ప్రసవాల వివరాలు**

| నెల | మొత్తం ప్రసవాలు | సర్కారులో | శాతం | ప్రైవేటు | శాతం |
|---|---|---|---|---|---|
| ఏప్రిల్- 23 | 512 | 286 | 56 | 226 | 44 |
| మే- 23 | 552 | 336 | 61 | 216 | 39 |
| జూన్-23 | 497 | 314 | 63 | 183 | 37 |
| జూలై-23 | 496 | 342 | 69 | 154 | 31 |
| ఆగస్టు-23 | 512 | 389 | 76 | 123 | 24 |
| సెప్టెంబర్-23 | 484 | 385 | 80 | 99 | 20 |
| అక్టోబర్ -23 | 482 | 370 | 77 | 112 | 23 |
| నవంబర్-23 | 489 | 377 | 77 | 112 | 23 |
| డిసెంబర్ -23 | 423 | 339 | 80 | 84 | 20 |

### వంద శాతమే లక్ష్యం



సర్కారు దవాఖానల్లో సరిపడా గైనకాలజిస్టులు ఉన్నారు. నాణ్యమైన మందులు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా సాధారణ ప్రసవాలపై ఎక్కువ దృష్టి సారించాం. ఈ క్రమంలో కలెక్టర్ ప్రత్యేకంగా చేపట్టిన మిషన్ 80 చాలా సక్సెస్ అయింది. ప్రసవాల సంఖ్య బాగా పెరిగింది. ఈ రోజు జిల్లాలో 80శాతం డెలివరీలు ప్రభుత్వ వైద్యశాలల్లోనే చేస్తున్నాం. దీనిని వందశాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాం. వైద్య సిబ్బంది, వైద్యుల సమష్టి కృషితోనే సత్ఫలితాలు సాధిస్తున్నాం.

**- డాక్టర్ మురళీధర్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన వైద్యశాల సూపరింటెండెంట్**

## ఆధునిక సేద్యంతోనే అధిక లాభాలు

- పంట మార్పిడిపై అవగాహన కల్పించాలి
- పెద్దపల్లి కలెక్టర్ ముజామిల్‌ఖాన్


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజామిల్‌ఖాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లి రూరల్, జనవరి 25: 'ఎప్పుడూ ఒకే పంట వేస్తే ప్రయోజనం లేదు. ప్రస్తుత కాలంలో ఆధునిక సేద్యం చేస్తేనే అధిక లాభాలు వస్తాయి. పంట మార్పిడితో కలిగే మేలుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి' అని కలెక్టర్ ముజామిల్‌ఖాన్ అధికారులకు సూచించారు. పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్టాళ్లను పరిశీలించారు. స్థానికంగా రైతు పండించిన టమాట పంట చేనును పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు వరే కాకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇక్కడ సర్పంచ్ గాండ్ల మల్లేశం, ఏడీఏ శ్రీనాథ్, మండల వ్యవసాయశాఖ అధికారి అలివేణి, ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి, ఉపసర్పంచ్ ఓదెల రాజు, ఎఫ్‌పీవో ప్రెసిడెంట్ వెంకటేశ్వర్‌రావు, రైతు మల్లారెడ్డి, కేవీకే సైంటిస్టులు వెంకన్న, భాస్కర్, కిరణ్, వినోద్ ఉన్నారు.




